

రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్ రావు, మాజీ శాసనసభ్యులు

మిర్చి రైతులను ఆదుకోవాలి

- క్వింటాకు రూ.25వేలు చెల్లించాలి
- నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి
- ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించాలి
- లేదంటే రైతుల పక్షాన పోరాడతాం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- బీఆర్ఎస్ నేతలతో కలిసి ఏనుమాముల మార్కెట్ సందర్శన

4

ఇంటర్ ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

- జిల్లా ఇంటర్ విద్యాధికారి మదార్‌గౌడ్

6

శరణమయ్యా శంకర

నేడు మహా శివరాత్రి పర్వదినం



మహబూబాబాద్‌లో శివరాత్రి వేడుకలకు విద్యుత్ దీపాలతో అలంకరించిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం



- వేడుకలకు ముస్తాబైన ఆలయాలు, శైవక్షేత్రాలు
- ఉపవాసం, జాగరణకు విస్తృత ఏర్పాట్లు
- కురవి క్షేత్రం సహా పలు దేవాలయాల్లో విద్యుత్ కాంతులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని జిల్లాలోని శైవక్షేత్రాలు మంగళవారం సాయంత్రం వరకు ముస్తాబయ్యాయి. శివపార్వతుల కల్యాణం నిర్వహించడానికి ఆలయాల్లో అర్చకులు, దేవాలయ కమిటీల బాధ్యులు ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం తెల్లవారుజామున తలంటు స్నానాలు ఆచరించి ఉపవాస దీక్షలు ప్రారంభించే భక్తులు సమీపాల్లోని శివాలయాలకు వెళ్లి శివపార్వతుల కల్యాణాన్ని తిలకించి భక్తి పారవశ్యంతో పులకించి పోతారు. తెలంగాణలోనే మేడారం తర్వాత రెండోస్థానంలో నిలుస్తున్న గిరిజనుల ఆరాధ్య దైవంగా ప్రసిద్ధి పొందిన కురవిలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి జాతరకు అధికార యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేసింది. దీంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గల శివాలయాల్లో మహాశివరాత్రి నాడు శివపార్వతుల కల్యాణం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. అన్ని దేవాలయాల్లో శివపార్వతుల కల్యాణాలు నిర్వహించడం ఆనవాయితీ కాగా, కురవిలో శ్రీభద్రకాళి వీరభద్రుల కల్యాణం నిర్వహించడం విశేషం. సాంప్రదాయ హిందు పండుగ రోజుల్లో మహాశివరాత్రి శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైందని భక్తులు విశ్వసిస్తారు. అందుకే అన్ని రోజుల కన్న మహాశివరాత్రి నాడు శివుడిని భక్తిశ్రద్ధలతో కొలవడం ఆనవాయితీగా వస్తోంది.

మహాశివరాత్రి అంటే...

శివ దేవేరి పార్వతి వివాహం జరిగిన రోజును మహాశివరాత్రి పర్వదినంగా కొలుస్తారు.. మరికొందరు శివుడి మహారాత్రి అని కూడ పిలుస్తారు. మహాశివరాత్రి చాంద్రమాన నెల లెక్కింపు ప్రకారం మాఘమాసం కృష్ణపక్ష చతుర్ధశి రోజున వస్తుంది. హిందువుల పండుగలలో మహాశివరాత్రి ప్రశస్తమైనది. ప్రతి సంవత్సరం మాఘ బహుళ చతుర్ధశి రోజున చంద్రుడు శివుని జన్మ నక్షత్రమైన అరుద్ర యుక్తుడైనప్పుడు వస్తుంది. శివుడు ఈ రోజున లింగాకారంగా ఆవిర్భవించాడని నానుడి. చాంద్రమాన నెల ప్రకారం ఈ రోజు గ్రెగేరియన్ క్యాలెండర్‌లో ఫిబ్రవరి లేదా మార్చి నెలలో ఈ పండుగ వస్తుంది. హిందువుల క్యాలెండర్ ప్రకారం ఫాల్గుణ మాసంలోని కృష్ణపక్ష చతుర్ధశిలో రావడంతో శివరాత్రులలో మహాశివరాత్రి అత్యంత పవిత్రమైనదిగా పేర్కొంటారు. ఈ పండుగ రోజున ప్రధానంగా బిల్వ ఆకులు భక్తులు శివుడికి సమర్పిస్తారు. పండుగ రోజున భక్తులు ఉపవాసం, రాత్రి జాగరణ చేస్తారు. తెల్లవారుజామున లేచి స్నానాలు ఆచరించి శివుడికి ప్రత్యేక పూజలు చేసి ఉపవాస దీక్షను విరమిస్తారు. శివాలయాలను రంగురంగుల మిరమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో సుందరంగా అలంకరిస్తారు.

వేడుకలకు ముస్తాబైన ఆలయాలు...

పట్టణంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ పార్వతిరామలింగేశ్వరస్వామి దేవాలయం, శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం, శ్రీ ఉమాచంద్రమౌళీశ్వరస్వామి దేవాలయం, భక్తమార్కండేయ ఆలయం విద్యుత్ కాంతులను మంగళవారం ఏర్పాటు చేశారు. ఆయా దేవాలయాల్లో బుధవారం దయం 3 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛ రణల నడుమ శ్రీ శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పతంజలి ప్రాణయోగా ఆరోగ్య సేవా కేంద్రంలో లోకకల్యాణార్థం దేవపూజ, అగ్నిహోత్రం కార్యక్రమాలు, ఆర్యసమాజ మందిరంలో పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. బయ్యారం, గంధంపల్లి శివాలయాలు, మరిపెడ మండలం అబ్బాయిపాలెంలోని అగస్త్రీశ్వర ఆలయం, మరిపెడ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయం, డోర్నకల్ మున్నేరువాగు సమీపంలోని పంచముఖ రామలింగేశ్వర స్వామి ఆలయం, పెరుమాండ్ల సంకీస, అమ్మపాలెం, గార్ల, పుల్లూరు, గుండెంగ, తొర్రూరు పాటిమీది, గూడూరులోని శివాల యాలు, ధన్నసరిలోని శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయంతో పాటు జిల్లాలోని అన్ని శివాలయాల్లో శివపార్వతుల కల్యాణ వేడుకలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

అంకురార్పణతో కురవి జాతర ప్రారంభం

కురవి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కురవి వీరభద్ర స్వామి మహాజాతర మంగళవారం రాత్రి అంకురార్పణ పూజా కార్యక్రమంతో మొదలైంది. ఆలయ అర్చకులు పాలవెళ్లి మూకుళ్లలో అంకురాలు నాటి, దేవతల ఆహ్వానానికి గుర్తుగా ధ్వజారోహణ గావించారు. ఇది వీరభద్రుని కళ్యాణ మహోత్సవం ప్రారంభానికి గుర్తు. అనంతరం గణపతి, మండపపూజ కార్యక్రమాలను అర్చకులు బాలకృష్ణ, శ్రీకాంత్, విజయ్, రెడ్యాల శ్రీనివాస్, పుణ్యమూర్తి లు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అంకురార్పణ పూజాకార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోర్ని రవీందర్‌రెడ్డి, ఈవో సత్యనారాయణ, మేక దామోదర్‌రెడ్డి, నూతక్కి నర్సింహారావు, బాలగాని శ్రీనివాస్, చిన్నం గణేష్, ఎర్ర నాగేశ్వర్‌రావు,అవిరె మోహన్‌రావు, వద్దుల సురేందర్‌రెడ్డి, శరత్ తదితరులు పాల్గొన్నారు.



కురవి వీరభద్రస్వామి ఆలయంలో అంకురార్పణ పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

తెలంగాణ పరువు తీసిన లిక్కర్ రాణి కవిత



- పదేళ్ల చరిత్రలో రూ.25వేల మద్దతు ధర ఎందుకు ఇవ్వలేదు?
- 'వేం'ను విమర్శించే స్థాయి ఆమెకు లేదు
- మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్

మహబూబాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లిక్కర్ స్కామ్‌లో తెలంగాణ పరువును బజారున పడేసిందని, మానుకోట పర్యటనలో కవిత సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేయడం సరికాదని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మిర్చికి రూ.25వేల మద్దతు ధర ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఖమ్మం జిల్లాలో మిర్చి రైతులకు సంకెళ్లు వేసి జైలుకు పంపిన చరిత్ర బీఆర్ఎస్‌దని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. లిక్కర్ స్కామ్‌లో కేజ్రీవాల్‌తో సన్నిహితంగా ఉండి ఆయన రాజకీయ జీవితాన్ని కనుమరుగు చేసిన ఘనత కవితదేనని విమర్శించారు. తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబం రాజకీయ పదవులు అనుభవించారంటే కాంగ్రెస్ పెట్టిన భిక్ష అని మర్చిపోవద్దని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను పెట్టకపోవడం చూస్తే బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనని అర్థమవుతోందని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో సైతం పరోక్షంగా బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిన సంగతి తెలంగాణ ప్రజలకుతెలుసని అన్నారు. పదేళ్లపాలనలో అంతా అవినీతే జరిగిందని, లక్షల కోట్ల కుంభకోణాలు చేసి దోచుకున్న సంగతి ప్రజలకు తెలుసునని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డిలపై చౌకబారు విమర్శలు చేస్తే కవితకు ప్రజలే బుద్ధిచెబుతారని అన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న సీపీఐ నేత డాక్టర్ నారాయణ

ప్రధాని మోదీ గుప్పిట్లో రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యం

- కేసీఆర్, జగన్ అసెంబ్లీకి రాకపోవడం ప్రజా తీర్పును అవమానించడమే
- చంద్రబాబుకు సంకెళ్లు కట్టి బీజేపీ జైలులో వేశారు
- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ

4

ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ప్రచారం

- జిల్లాలో 16 పోలింగ్ కేంద్రాలు.. 1663 మంది ఓటర్లు
- పురుషులు 1,112.. మహిళలు 551 మంది ఓటర్లు
- నేడు మానుకోటలో ఎన్నికల సామగ్రి పంపిణీ

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ, వరంగల్, ఖమ్మం నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార పర్వం మంగళవారం సాయంత్రం 4 గంటలతో ముగిసింది.. ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలకు 48 గంటల ముందు ప్రచారం ముగిసింది. మహబూబాబాద్ జిల్లాలో సజావుగా, ప్రశాంతగా ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పోలింగ్ అధికారులు, సిబ్బందికి శిక్షణ పూర్తిచేశారు. ఈ నెల 26న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేయనున్నారు. అక్కడ నుంచి వాహనాల్లో వారికి కేటాయించిన మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్నారు.

జిల్లాలో 16 పోలింగ్‌కేంద్రాలు... 1663 మంది ఓటర్లు....

ఫిబ్రవరి 27న జరిగే నల్లగొండ, వరంగల్, ఖమ్మం నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మహబూబాబాద్ జిల్లాలోని పూర్వ 16 మండలాల పరిధిలో 1663 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1112 మంది ఉండగా, మహిళలు 551 మంది ఉన్నారు. వీరంతా ఓటు హక్కు వినియోగించుకునేందుకు జిల్లాలోని 16 మండల కేంద్రాల్లో పదహారు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో మహబూబాబాద్ డివిజన్‌లో 9 మండలాల పరిధిలో 1090 మంది ఓటర్లుండగా 9 పోలింగ్ కేంద్రాలు, తొర్రూరు డివిజన్‌లోని 7 మండలాల పరిధిలో 573 మంది ఓటర్లుండగా వారంతా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా మహబూబాబాద్‌లో అత్యధికంగా 400 మంది ఓటర్లు ఉండగా అత్యల్పంగా చిన్నగూడూరులో కేవలం 15 మంది ఓటర్లుఉన్నారు.



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన గూడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ఎమ్మెల్సీ పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు ఎన్నికల సంఘం, సూచనలు అమలు చేస్తూ సిద్ధమైనట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లాలో మొత్తం 16 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 1112 మంది పురుషులు, 551 మంది మహిళలు మొత్తంగా 1663 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎన్నికల సంఘం సూచనలు మేరకు పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, పారిశుద్యం తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ నెల 26న మానుకోట ఫాతిమా హైస్కూల్‌లో ఎన్నికల సామాగ్రిని పంపిణీచేయడం జరుగుతుందని, రవాణా, భద్రత, వైద్య సౌకర్యాలు కల్పించి ఎన్నికల నిర్వహణకు సిద్దంగా ఉన్నామన్నారు. ఈ స మావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కె. వీరబ్రహ్మచారి, ఎన్నికల నోడల్ అధికారులు వెంకటేశ్వర్లు, మధుసూదన్‌రాజు, నర్సింహస్వామి, విజయనిర్మల, మరియన్న, ప్రేమ్‌కుమార్, సురేష్, సుబ్బారావు, కృష్ణవేణి, హరిప్రసాద్, రాజేంద్రప్రసాద్, పాల్గొన్నారు.



మహబూబాబాద్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

ఓటు హక్కు కలిగిన ఉపాధ్యాయులకు ప్రత్యేక సాధారణ సెలవు...

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ రోజు ఫిబ్రవరి 27న ఓటు హక్కు వినియోగించుకునే ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులకు ప్రత్యేక సాధారణ సెలవు వర్తిస్తుందని ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నమోదిత ఓటర్లుగా ఉన్న వారు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఈ ప్రత్యేక సెలవు వర్తిస్తుందని చెప్పారు. అన్ని ప్రైవేట్ మేనేజ్‌మెంట్, అథారిటీలో పని చేస్తూ ఓటు హక్కు ఉన్న ఉపాధ్యాయులు సైతం వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు యాజామాన్యాలు అనుమతి, వెసులు బాటు ఇవ్వాలన్నారు. ఓటు వేసేందుకు పని గంటల తగ్గింపు, ఆలస్యంగా హాజరు కావడానికి అనుమంతి కల్పించాలన్నారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి

- క్వింటాకు రూ.25వేలు చెల్లించాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- బీఆర్ఎస్ నేతలతో కలిసి ఏనుమాముల మార్కెట్ సందర్శన



మీడియాతో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని, గండ్ర

వరంగల్ వ్యవసాయం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మిర్చి పంటకు క్వింటాకు రూ.25వేల మద్దతు ధర చెల్లించి రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మిర్చి ధరలు పడిపోయి రైతులు ఆందోళన చెందుతున్నారని తెలుసుకున్న బీఆర్ఎస్ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నేతృత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్, ముఖ్య నాయకులు నాగుర్ల వెంకటేశ్వర్లు, చింతం సదానందం తదితరులు మంగళవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి యాకర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాడి మిర్చి ధర పెంచేందుకు కృషి చేస్తామన్నారు. మార్కెట్లలో మిర్చి రైతులు ఇబ్బందులు పడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నాడని, ఎలక్షన్ల ప్రచారం అంటూ తిరుగుతున్నాడని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ రైతులకే ప్రాధాన్యం ఇచ్చేవారని, అందుకే దక్కులు దున్నేటప్పుడే రైతుబంధు ఇచ్చేవారని, రైతులకు 24 గంటల ఉచిత కరెంటు, కాలువల ద్వారా 365 రోజులు పంటలకు నీళ్లు అందించేవారని గుర్తుచేశారు. మాయ మాటలు చెప్పి రేవంత్ రెడ్డి సీఎం అయ్యాడని, ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కాడని విమర్శించారు. ఇప్పటివరకు ఎక్కడా రైతుబంధు కాని, రుణమాఫీ కాని పూర్తిస్థాయిలో చేయలేదన్నారు. గత ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు మార్కెట్ల చుట్టూ తిరిగి రైతులకు మద్దతు ధర వచ్చేటట్లు చూసేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం 15రోజుల నుంచి మిర్చి రైతులు ఆందోళన చెందుతుంటే.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే మిర్చి రైతులకు అన్యాయం జరుగుతోందని, ఇప్పటికైనా ఆ పార్టీల నాయకులు స్పందించి మిర్చి రైతులకు న్యాయం చేయాలని, లేదంటే రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో మిర్చి రూ.30వేల నుంచి లక్ష రూపాయలు పలికేదని, ఇప్పుడు తొమ్మిది, పది వేలే పలుకుతోందని, దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రూ.25వేల చొప్పున నాఫెడ్, మార్క్‌ఫెడ్‌తో కొనుగోలు చేయించాలని ఆయన డిమాండ్ చేశారు.

భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో మిర్చికి రూ.15వేలు చెల్లిస్తామని చెప్పి.. ఇపుడు తప్పించుకు తిరుగుతున్నారని విమర్శించారు. మిర్చిని ఇతర దేశాలకు ఎగుమతి చేసే విధంగా కేంద్రం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్లే గిట్టుబాటు ధర లేక రైతులు, ఎగుమతులు లేక వ్యాపారులు, పని లేక కార్మికులు రోడ్డున పడుతున్నారని అన్నారు. పదేళ్ల కిందటినాటి ధరలే ఇప్పుడు ఉన్నాయని, ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ఒక్కరోజు కూడా మంత్రులు, ఎమ్మెల్యేలు మార్కెట్లను సందర్శించిన దాఖలాలు లేవని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం కనిష్ఠ ధర రూ.15వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.



ఘాటు పర్యటన..

మిర్చి పంటకు మార్కెట్‌లో సరైన ధర రావడం లేదని, ఫలితంగా రైతులు నష్టపోవాల్సి వస్తోందని.. వారి కష్టాలు, నష్టాల గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ బీఆర్ఎస్ నేతలు 'ఘాటు' విమర్శలు చేశారు. మంగళవారం ఏనుమామల మార్కెట్‌ను సందర్శించిన వారు రైతుల సాదకబాధకాలను తెలుసుకున్నారు. అయితే మార్కెట్‌కు మిర్చి పోటెత్తడం, పంట తొక్కుడు కారణంగా మిర్చి ఘాటు లేచి.. నాయకులు, వారితో పాటు వచ్చిన కార్యకర్తలు ఉక్కిరిబిక్కిరయ్యారు. తుమ్ములు, దగ్గుతో సతమతమయ్యారు. ఇబ్బంది పడుతూనే తమ పర్యటన కొనసాగించిన నేతలు.. మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

ఎన్నికల్లో ధన ప్రవాహానికి

అడ్డుకట్ట వేయాలి

- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో ధన ప్రవాహానికి అడ్డుకట్ట వేయాలని తెలంగాణ జన సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ఉద్యమనేత పన్నాల గోపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి పట్టం కట్టాలని ఉపాధ్యాయ, అధ్యాపకులకు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పన్నాల గోపాల్‌రెడ్డిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపిస్తే కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేందుకు కృషి చేస్తారని చెప్పారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ధన ప్రవాహానికి తలొగ్గకుండా తనకు ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులు, అధ్యాపకులను కోరారు. ఈ సమావేశంలో టీజేఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు చిల్లా రాజేంద్రప్రసాద్, గూడబోయిన నాగేశ్వర్‌రావు యాదవ్, శ్రీరామ్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ గుప్పిట్లో రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యం

- కేసీఆర్, జగన్ అసెంబ్లీకి రాకపోవడం ప్రజా తీర్పును అవమానించడమే..
- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కె.నారాయణ

న్యూశాయంపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ గుప్పిట్లో రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణ మాట్లాడారు. రాజకీయ పార్టీలపై కార్పొరేట్ శక్తుల ఆధిపత్యం రోజురోజుకూ పెరిగిపోతుందని, ఇది దేశానికి, సమాజానికి ఎంతో ప్రమాదకరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కార్పొరేట్ శక్తులు బలపడుతూ రాజకీయాలను శాసిస్తున్నారని, అమెరికాలో ఎలాన్ మస్క్, ఇండియాలో అదానీ ఒక్కటవుతున్నారన్నారు. కార్పొరేట్ శక్తులు ప్రజలకు సేవ చేయరని, వారికి లాభం ఒక్కటే లక్ష్యమన్నారు. ప్రపంచంలో అమెరికా ఇతర దేశాలపై ఆధిపత్యం చెలాయించాలనుకోవడం, కమ్యూనిస్టు దేశాలను బలహీనపరచడం చేసినట్లుగానే మనదేశంలో ప్రధాని మోదీ తమ మాట వినని వారిపై రాజ్యాంగ సంస్థలతో దాడి చేయించి దారికి తెచ్చుకుంటున్నారన్నారు. మోదీ పాలనలో గజ దొంగలను, దోపిడీ దారులను వెనకేసుకురావడం వలన మొత్తం వ్యవస్థ దెబ్బతిందన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో ఒకటే ప్రభుత్వం ఉంటే డబుల్ ఇంజన్ సర్కారులా అభివృద్ధి జరుగుతోందని మోదీ చెప్పారని, మరి మణిపూర్‌లో, కేంద్రంలో ఒకే ప్రభుత్వం ఉన్నా ఎందుకు విఫలమయ్యారని ప్రశ్నించారు.

గతంలో మోదీ పాలన బాగుంటే 303 సీట్ల నుంచి 242 సీట్లకు ఎందుకు తగ్గారని ప్రశ్నించారు. దేశంలోనే ఏ ప్రధాన మంత్రికి రానంత తక్కువ మెజారిటీతో మోదీ గెలిచారన్నారు. చంద్రబాబునాయుడు, నితీష్‌కుమార్‌లను లొంగదీసుకుని ప్రభుత్వం ఏర్పాటు చేశారన్నారు. మొన్న జరిగిన ఢిల్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఇచ్చిన లిక్కర్ కుంభకోణం డబ్బును తీసుకుని ఆప్ ఓడిపోయిందని, ఆ ఎన్నికల్లోనూ కాంగ్రెస్, ఆప్ కలవకుండా మోదీ ఆప్‌ను బ్లాక్ మెయిల్ చేశారన్నారు. నేడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోను ఇలాంటి బ్లాక్ మెయిల్ రాజకీయాల ద్వారా పార్టీలను బీజేపీ గుప్పిట్లో పెట్టుకుందన్నారు. చంద్రబాబుకు సంకెళ్లు కట్టి బీజేపీ జైలులో వేశారన్నారు. తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేయడం వల్లే నిధులు లేక కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతోందన్నారు. రాష్ట్రంలో కూడా అన్ని రకాల వ్యవస్థలను బీఆర్ఎస్ చెడగొట్టిందన్నారు. కేసీఆర్, జగన్ అసెంబ్లీకి రాకుంటే ప్రజా తీర్పును అవమానించడమే అవుతుందని, కాబట్టి వీరిద్దరూ రాజకీయ సన్యాసం తీసుకుంటే మంచిదని సలహా ఇచ్చారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని, అందువల్ల తాము అప్పుడే వాటికి వ్యతిరేకంగా నిలబడిన కాంగ్రెస్‌ను విమర్శించబోమన్నారు. బీజేపీ ప్రజావ్యతిరేక పాలనపై కేసీఆర్ నోరు మెదపకపోవడంలో ఆంతర్యమేమిటో చెప్పాలన్నారు. తమకు రాష్ట్రంలో ఎలాంటి పరిస్థితులున్నా.. ప్రజల కోసం పోరాడుతామని, కమ్యూనిస్టుల పునరేకీకరణకు కృషి చేస్తామని అన్నారు. రాష్ట్రంలో జరిగిన కులగణనను స్వాగతిస్తున్నామని, దాని వలన రాజకీయాలలో గుత్తాధిపత్యం పోతుందని, కులగణన వలన రాజకీయాల్లో పెనుమార్పులు వస్తాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సీపీఐకి రెండు ఎమ్మెల్సీ పదవులు ఇస్తామని ఎన్నికల పొత్తులో భాగంగా మాట ఇచ్చిందని, దానికి కట్టుబడి ఉండాలన్నారు.

ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఐ జిల్లా నాయకులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, మద్దెల ఎల్లేష్, కొట్టెపాక రవి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులు ఏకం కావాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- నగరంలో ఘనంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు



వరంగల్ నగరంలో ర్యాలీగా వెళ్తున్న సీపీఐ నాయకులు

వరంగల్ టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో కమ్యూనిస్టులు ఏకం కావాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. మంగళవారం భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) 100వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఇస్లామియా కాలేజీ నుంచి వరంగల్ అబ్బాస్ ఫంక్షన్ హాల్ వరకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఎర్ర జెండాలు పట్టుకొని నినాదాలు చేసుకుంటూ భారీ ప్రదర్శన నిర్వహించారు. సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా కె.నారాయణ మాట్లాడుతూ.. సీపీఐది త్యాగాలు, పోరాటాల చరిత్ర అని అన్నారు. దేశంలో కమ్యూనిస్టులు బలపడాల్సిన అవసరం ఉందన్నారు. ఓట్లు, సీట్లు, ఎత్తుల చిత్తుల ప్రలోభాలకు లొంగకుండా రాగద్వేషాలకు, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా పోరాడుతున్నది కేవలం సీపీఐ మాత్రమేనన్నారు. దేశంలో రాజకీయాలు కార్పొరేట్ వర్గాల చేతుల్లో ఉన్నాయని, పెట్టుబడిదారి వర్గ మతోన్మాద పార్టీలైన బీజేపీ అదాని, అంబానీలకు ఊడిగం చేస్తున్నాయని అన్నారు. అలాంటి పార్టీల మెడలు వంచడం కేవలం ఎర్రజెండాతోనే సాధ్యమన్నారు. ఏడు జన్మలెత్తినా మోదీ, అమిత్‌షా పేదల ఉద్యమాలను అణిచివేయలేరని స్పష్టం చేశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మావోయిస్టులు తమ పద్ధతులను మార్చుకోవాలని, ప్రజాస్వామ్య పద్ధతిలో కమ్యూనిస్టులతో కలిసి పోరాటాలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.విజయసారథి, నాయకులు కర్రె భిక్షపతి, టి.వెంకట్రాములు, పంజాల రమేష్, వలీఉల్లాఖాద్రీ, షేక్ బాషుమియా, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న బైరి రవికృష్ణ గౌడ్

కాజీపేట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్ కోరారు. కాజీపేట ఫాతిమా నగర్ వైష్ణవి గ్రాండ్ హోటల్‌లో మంగళవారం బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో రవికృష్ణ గౌడ్ హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి అగ్రవర్ణాలు బీసీల హక్కులను దోచుకుంటున్నారన్నారు. బీసీల హక్కుల గురించి పోరాడుతున్నామని చెప్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న బీసీ అభ్యర్థులకు మద్దతివ్వాలని కోరారు. బీసీ వాదాన్ని, బీసీ గలాన్ని శాసనమండలిలో వినిపించాలంటే బీసీ అభ్యర్థులను గెలిపించాలని బీసీ ఉపాధ్యాయులకు, బీసీ పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దాడి మల్లయ్య యాదవ్, బచ్చు ఆనంద్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మజదేవి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శోభారాణి, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం. అరుంధతి, నాయకులు బి. యాదగిరి గౌడ్, జి.శ్రీనివాస్, కె.అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలి

వడ్డెపల్లి: ఉపాధ్యాయ, అధ్యాపక ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలు తమ సత్తా చాటి బీసీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని తెలంగాణ బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డాక్టర్ కూరపాటి రమేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందా మల్లయ్య, రాష్ట్ర సెక్రటరీ మండల పరశురాములు పిలుపు నిచ్చారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జనాభాలో 10 శాతం కూడా లేని అగ్రవర్ణాలు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా ఎన్నికవుతూ 56 శాతం ఉన్న బీసీలను అణగదొక్కుతున్నారని దుయ్యబట్టారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న జరిగే వరంగల్, ఖమ్మం, నల్గొండ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి శాసన మండలికి పంపించాలని ఉపాధ్యాయ, అధ్యాపకులను వారు కోరారు. సమావేశంలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం జిల్లా నేతలు జంగిలి శ్రీనివాస్, పెండ్యాల సంపత్‌కుమార్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కూరపాటి రమేష్, చందా మల్లయ్య, మండల పరశురాములు

కేయూలో 'అకూట్' ఎన్నికల సందడి

- అధ్యక్ష, కార్యదర్శుల పదవులకు పోటాపోటీతో పోరు రసవత్తరం



కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో కేయూ టీచర్స్ అసోసియేషన్ (అకూట్) ఎన్నికల సందడి నెలకొంది. ఈ మేరకు అకూట్ ఎన్నికల షెడ్యూల్‌ను వర్సిటీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు విడుదల చేశారు. ఫిబ్రవరి 24 సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ సాగింది. అధ్యక్షపదవికి కేయూ భూగర్భశాస్త్రం విభాగం ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, భౌతిక శాస్త్ర విభాగం ప్రొఫెసర్ బి.వెంకట్రామిరెడ్డి, జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీలు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే జనరల్ సెక్రటరీ పదవీకి కేయూ బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీనివాస్, మ్యాథ్స్ విభాగం ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, మైక్రోబయోలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ముంజం శ్రీనివాస్, కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ జె.చిన్నాలు పోటీలో నిలిచారు. కాగా, ఉపాధ్యక్ష పదవికి కేయూ క్యాంపస్ కళాశాల కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ టి.సవితాజ్యోత్స్న, జాయింట్ సెక్రటరీగా కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.రాము, కోశాధికారిగా వర్సిటీ కంప్యూటర్ సైన్స్ డి.రమేశ్‌లు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వీరికి పోటీ లేకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వర్సిటీ ఎన్నికల అధికారులు ప్రకటించారు. వీరితో పాటు పలువురు క్యాంపస్ కళాశాల నుంచి డాక్టర్ ఎం.స్వర్ణలత, డాక్టర్ పి. వెంకటయ్య, ఫార్మసీ కళాశాల నుంచి డాక్టర్ షయేదా, క్యాంపస్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి కె.సుమలత, వుమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఎం. వేణుగోపాల్‌రెడ్డి, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, యూనివర్సిటీ పీజీ కళాశాల నుంచి ప్రొఫెసర్ పి.వరలక్ష్మి, కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల నుంచి డాక్టర్ ఇ.హరికృష్ణలను ఈసీ మెంబర్లను ఏకగ్రీవంగా ప్రకటించారు. ప్రధానంగా అధ్యక్షకార్యదర్శుల పదవులకే పోటాపోటీ నెలకొంది. ఎన్నికలు రసావత్తరంగా సాగనున్నాయి.

4న ఎన్నికలు, 5న ఫలితాలు

కాకతీయ యూనివర్సిటీ అకూట్ ఎన్నికల కోసం వర్సిటీ రిటర్నింగ్ అధికారులు షెడ్యూల్‌ను ప్రకటించారు. మార్చి 4న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికల ప్రకయ సాగుతుంది. ఫిబ్రవరి 27 సాయంత్రం 4 గంటల వరకు పోటీలో ఉన్న అధ్యాపకులు తమ నామినేషన్ల విత్‌డ్రాకు అవకాశం ఉంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు పోటీలో నిలిచిన అభ్యర్థులు తుది జాబితాను ప్రకటిస్తారు. 28న ఓటర్ల లిస్టును ప్రకటిస్తారు. 28 నుంచి మార్చి 3 వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించుకునే అవకాశం కల్పిస్తారు. మార్చి 4న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. వర్సిటీ క్యాంపస్‌తో పాటు కొత్తగూడెంలోని ఇంజనీరింగ్ కళాశాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మార్చి 5న మధ్యాహ్నం 2 గంటల నుంచి వర్సిటీ పరిపాలన భవనంలోని సెనెట్ హాల్‌లో ఓట్ల లెక్కింపు చేపట్టి తుది ఫలితాలను ప్రకటిస్తారు. ఇదిలా ఉండగా, వర్సిటీలో పరిపాలన పదవుల్లో ఉన్న అధ్యాపకులు అకూట్‌కు పోటీ పడటం పట్ల వారి నామినేషన్లను తిరస్కరించాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను కలిసి అకూట్ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.


విద్యుత్ కాంతుల్లో వరంగల్ కాశిబుగ్గ కాశీ విశ్వేశ్వరాలయం

- ఉమ్మడి జిల్లాలోని ఆలయాలు, శైవక్షేత్రాలు ముస్తాబు
- అభిషేకాలు, హోమాలు, లింగోద్భవ పూజలు, కల్యాణాలకు ఏర్పాట్లు
- భక్తుల కోసం చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లు
- పూలు, పండ్లు, పూజాసామగ్రి అమ్మకాలతో మార్కెట్‌లో సందడి

అర్ధరాత్రివేళ లింగోద్భవ పూజలు

లింగరూపంలో ఉండే పరమేశ్వరుడికి అర్ధరాత్రి వేళ లింగోద్భవ సమయంలో అంగన్యాస కరన్యాస నమక చమకాలతో శివుడికి అభిషేకాలను నిర్వహిస్తారు. మహా శివరాత్రి రోజున మహా దేవుడికి అభిషేకం నిర్వహించడం జన్మజన్మల పుణ్యఫలంగా భక్తులు భావిస్తారు. జిల్లాలోని శివాలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథ కాలక్షేపాలు, దివ్యనామ సంకీర్తనలు, నాట్యప్రదర్శనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆలయాల వద్ద భక్తుల దర్శనాలకు చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాల వద్ద భక్తులకు ఉచితంగా ప్రసాదాల పంపిణీ, పండ్ల పంపిణీ చేస్తున్నారు. బ్రహ్మకుమారి సమాజం ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేస్తారు.



ఓం నమః శివాయ

నేడు మహాశివరాత్రి పర్వదినం

వరంగల్ కల్చరల్ / హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి దేవుడికి మొక్కులు చెల్లించడానికి.. లింగరూపంలో ఉన్న పరమేశ్వరుడికి అభిషేకాలు చేయడానికి.. భక్తులు సిద్ధమయ్యారు. కాసిన్ని నీళ్లతో శివ.. శివ.. అంటే అభయమిచ్చే పరమేశ్వరుడు మహాశివరాత్రి పర్వదినమైన బుధవారం రోజున పూజలందుకోవడానికి కొలువుదీరాడు. ఎంతో పవిత్రమైన శివరాత్రి వేడుకలుకు కాకతీయ రాజులు నిర్మించిన ఉమ్మడి జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. రంగురంగుల విద్యుత్ కాంతులతో.. మామిడి తోరణ మాలలతో.. ముద్ద బంతి పూల దండల అలంకరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. శివరాత్రి రోజున ప్రత్యేక పూజలు, అభిషేకాలు, లింగోద్భవపూజలు, శివపార్వతుల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తవగా.. శంభో శంకర.. హరహర మహాదేవ.. అంటూ భక్తులు పరమేశ్వరుడిని మనసారా కొలుస్తూ ఉపవాస దీక్షతో జాగరణ చేయనున్నారు. ఇందుకోసం దేవాదాయశాఖ, ఆలయ పాలకమండళ్ల ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు.

ఉత్సవాలకు సిద్ధమైన దేవాలయాలు

హనుమకొండలోని ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో బుధవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే భక్తుల దర్శనానికి అనుమతించనున్నారు. సామూహిక రుద్రాభిషేకాలు, జాగరణ ఉండే భక్తులకు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు సాయంత్రం 6.30 గంటలకు రుద్రేశ్వరుడి కల్యాణం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో అనిల్‌కుమార్, ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. అదే విధంగా హనుమకొండ హయగ్రీవాచారి గ్రౌండ్‌లో ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి తెల్లవార్లు ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నారు. హనుమకొండలోని సిద్ధేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలు పెద్ద ఎత్తున జరగనున్నాయి. హనుమకొండ కాకాజీకాలనీలో జలేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించడంతోపాటు జాగరణ ఉండే భక్తులకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మట్ట శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. హనుమకొండ ములుగురోడ్‌లోని గురుధామంలో మహాశివరాత్రి పర్వదిన వేళ శివానంద కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమష్టి రుద్రాభిషేకంతోపాటు శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. హనుమకొండ ఏనుగులగడ్డలో 108 శివలింగాలతో ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో దివ్యదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వరంగల్ నగరంలో ప్రసిద్ధి చెందిన శివాలయాలు అయిన స్వయం భూ శంభులింగేశ్వరుడు, కాశిబుగ్గ విశ్వేశ్వరుడు, ఆకారపు వారి కాశీ విశ్వేశ్వరుడు, కరీమాబాద్ బొమ్మల గుడి, భద్రకాళిలోని భద్రేశ్వరుడు, మట్టెవాడలోని భోగేశ్వరుడు, రామన్నపేటలోని రామలింగేశ్వరుడు ఉత్సవాలకు సిద్ధమయ్యారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవతో శివాలయాల్లో అభిషేకాలు ప్రారంభమవుతాయి. ఆవు పాలు, పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, విభూది, చందన అభిషేకాలు స్వామివారికి నిర్వహించిన అనంతరం ఏక బిల్వాలు, మారేడు దళాలు, పూల మాలలతో అందంగా అలంకరణ చేసి మంగళహారతులు పడతారు. సాయంకాలం రుద్రహోమాలు నిర్వహిస్తారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయి.


వేయి స్తంభాల గుడిలో ఏర్పాట్లు

జోరుగా పూలు, పండ్ల అమ్మకాలు

పండుగ వేళ భక్తులు శివుడికి జాగరణ, ఒక్క పొద్దులు నిర్వహిస్తారు. నైవేద్యంగా అభిషేకాలకు ఉపయోగించే కందగడ్డ, పూలు, పండ్లు ఖర్జూర, డ్రై ఫ్రూట్స్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వరంగల్ చౌరస్తా, పోస్టాఫీస్ సెంటర్, వెంకట్రామ జంక్షన్, కాశిబుగ్గ, పోచమ్మ మైదాన్, బట్టల బజార్, అండర్‌బ్రిడ్జి, ఫోర్ట్ రోడ్డు, కరీమాబాద్ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పండ్ల దుకాణాలు వెలిశాయి.


బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన కురవి వీరభద్రస్వామి ఆలయం

కురవి క్షేత్రం ముస్తాబు

నేటి నుంచి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు

కురవి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహబుబాబాద్ జిల్లాలో పుణ్యక్షేత్రంగా విలసిల్లుతున్న కురవి వీరభద్రుడి క్షేత్రం మహాశివరాత్రికి ముస్తాబైంది. ఈ పర్వదినం సందర్భంగా జరిగే జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తుల పాలిట కొంగుబంగారమైన వీరన్న కళ్యాణ వైభోగాన్ని చూసేందుకు భక్తజనం తండోపతండాలుగా తరలిరానున్నారు. వీరభద్రుని కళ్యాణోత్సవాల్లో బాగంగా మంగళవారం ఉదయం ఆలయ అర్చకులు పసుపు, కుంకుమలు తీసుకువచ్చే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోర్ని రవీందర్‌రెడ్డి, ఈవో సత్యనారాయణ, అర్చకులు బాలకృష్ణ, శ్రీకాంత్, రెడ్యాల శ్రీనివాస్, అనిల్, విజయ్, పుణ్యమూర్తి, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాల నేపథ్యంలో కురవి అవతలి నుంచి కెనాల్ రోడ్డు మీదుగా వాహనాల మళ్లింపు, ప్రత్యేక వీఐపీ, స్పెషల్ దర్శనం, ధర్మ దర్శనం కౌంటర్లు, మరిపెడ, మహబు బాబాద్ రహదారిలో వాహనాల నిలిపివేత, ఖమ్మం రహదారి ద్వారా వచ్చే వాహనాలను ఈసారి గ్రామం బయటే నిలుపనున్నారు. ఎలక్షన్‌కోడ్ కారణంగా పాఠశాల గ్రౌండ్ వరకు అనుమతి ఇవ్వడం లేదు. జాతరకోసం 150మంది ప్రత్యేకసిబ్బంది, స్రీలకోసం ప్రత్యేక స్నానఘట్టాలు, నేరడ రోడ్డులో బస్టాండ్ ఏర్పాటు, మరిపెడ, మహబూబాబాద్ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశారు. కురవి సంతలో భక్తులకోసం తాత్కాలిక మరుగదొడ్లు ఏర్పాటుచేశారు.


వీరభద్రుని కల్యాణ ఉత్సవాల్లో భాగంగా పసుపు, కుంకుమలు తీసుకొస్తున్న అర్చకులు

మూడురోజులు.. ముక్కంటి వేడుకలు

- శివరాత్రికి ముస్తాబైన రామప్ప
- నేటి కల్యాణోత్సవానికి రానున్న సీతక్క

వెంకటాపూర్, ఫిబ్రవరి 25, (ఆంధ్రజ్యో తి): మూడు రోజుల పాటు జరిగే ముక్కం టి వేడుకలకు ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప ఆలయం ము స్తాబైంది. భక్తుల కోసం అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. విద్యుద్దీపాలు, మామిడాకుల తోరణాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో 300 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పరకాల, భూపాలపల్లి, హనుమకొండ నుంచి భక్తుల కోసం ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపిస్తోంది. వైద్య సౌకర్యం, పారిశుధ్య నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు ఆలయ ఈవో బిల్ల శ్రీనివాస్ తెలిపారు. రామప్పలో శివరాత్రి వేడుకల ఏర్పాట్లను అదనపు కలెక్టర్ సంపత్‌రావు మంగళవారం పరిశీలించారు. బుధవారం ఉదయం ప్రారంభం కానున్న వేడుకలు శుక్రవారం ముగియనున్నాయి. ఈ క్రమంలో మహాశివరాత్రి పర్వదినమైన బుధవారం నిర్వహించే శ్రీభవానీ సహిత రామలింగేశ్వరస్వామి కల్యాణానికి మంత్రి ధనసరి సీతక్క హాజరు కానున్నారు. స్వామివారికి ఆమె పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. మంత్రితోపాటు కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్ పూజల్లో పాల్గొననున్నారు.


విద్యుత్ వెలుగుల్లో రామప్ప దేవాలయం

నేడు ఐనవోలు మల్లన్న కల్యాణం

పెద్దపట్నం కోసం నృత్యమండపం ముస్తాబు

ఐనవోలు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రిని పురస్కరించుకొని ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. బుధవారం ఉదయం 4గంటలకు స్వామి వారి మేలుకొలుపు సుప్రభాతసేవ ప్రాత:కాల పూజ, ఉదయం 8 గంటలకు సింహవాహనసేవ గవ్యాంత పూజలు అష్టోత్తర(108) శతకలశార్చన తదుపరి మహాన్యాసపూర్వక మహారుద్రాబిషేకం నిర్వహిస్తారు. రాత్రి 9 గంటలకు శ్రీభ్రమరాంభిక మల్లికార్జునస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా కల్యాణానికి ప్రభుత్వం నుంచి పట్టువస్త్రాలను ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు దంపతులు తీసుకరానున్నారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవకాలంలో అష్టోత్తర శతకలశములచే విశేష మహాఅభిషేకం, నీరజన మంత్రపుష్ప పూజలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం తూర్పు వైపున ఉన్న కాకతీయుల నృత్యమండపంలో ఒగ్గుపూజారులు నిర్వహించే పెద్దపట్నం కార్యక్రమంలో తొక్కిసలాటలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు మామునూరు ఏసీపీ తిరుపతి, పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సై పస్తం శ్రీనివాస్, ఈవో నాగేశ్వర్‌రావు, ఒగ్గుపూజారులతో కలిసి మండపాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించారు. పెద్దపట్నం వద్ద తొక్కిసలాట జరుగకుండా, శివకల్యాణం కోసం పోలీస్ బందోబస్తును నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


విద్యుత్ వెలుగుల్లో కాళేశ్వరంలోని ముక్తీశ్వరాలయం

కాళేశ్వరం.. శివరాత్రి వైభవం

- ముక్తీశ్వర సన్నిధిలో ప్రారంభమైన వేడుకలు
- భారీగా తరలివచ్చిన భక్తులు


మహా శివరాత్రి వేడుకలను ప్రారంభిస్తున్న అర్చకులు

మహదేవపూర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : కాళేశ్వర క్షేత్రం శివరాత్రి వైభవాన్ని సంతరించుకుంది. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అంగరంగ వైభవంగా వేడుకలు ప్రారంభమయ్యాయి. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారికి సుప్రభాతసేవ, శైవతారాధ్యసేవ, మూర్తిదేవతాభిషేకం, నమక చమక సహిత రుద్రహోమం, చండీహోమం, నవగ్రహ హోమం, యోగిని భైరవ హోమం, మహానైవేద్యం, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ, నిర్వహించారు. ఇక ఈ ఉత్సవాలకు రాష్ట్రం నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలొస్తున్నారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మహేష్, అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తి శర్మ, రామకృష్ణ శర్మ, అర్చకులు, ఆలయ సిబ్బంది, మాజీ ధర్మకర్తలు అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని ఈవో మహేష్ తెలిపారు.

చాక్‌పీస్‌లతో శివలింగాలు

గురుకులం ఉపాధ్యాయుడి ప్రతిభ

కాటారం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రతిభతో పాటు భక్తిభావాన్ని చాటుకున్నాడు ఓ ఉపాధ్యాయుడు. చాక్‌పీస్‌లతో తన సూక్ష్మ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు భూపాలపల్లి జిల్లా కాటారం గిరిజన సంక్షేమ బాలుర గురుకులం విద్యాలయానికి చెందిన ఆర్ట్ టీచర్, మైక్రో ఆర్టిస్ట్ ఆడెపు రజనీకాంత్. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సుమారు 10గంటల పాటు శ్రమించి 30చాక్‌పీసులను గుండుపిన్ను సాయంతో చెక్కాడు. స్కల్ప్చరింగ్ ఆర్ట్ ద్వారా 1.5సెం.మీ ఎత్తుండే 108 శివలింగాలు తయారు చేశాడు. ఆ శివలింగాలనే త్రిశూలం, మహాశివలింగంలా పేర్చాడు. సూక్ష్మకళతో ప్రతిభను చాటిన రజనీకాంత్‌ను పలువురు అభినందించారు.


చాక్‌పీస్‌లతో రూపొందించిన శివలింగాలతో మహాశివలింగం

శివరాత్రి సందర్భంగా నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి పండుగ పురస్కరించుకొని నగరంలోని వేయి స్తంభాల ఆలయం పరిసరాల్లో భక్తులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా వాహనాలను మళ్లిస్తున్నట్లు వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ జి.సీతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు రోడ్డు నుంచి వేయిస్తంభాల గుడి వైపు వచ్చే భక్తుల వాహనాలను అలంకార్ జంక్షన్ వరకే అనుమతిస్తారన్నారు. హనుమకొండ చౌరస్తా నుంచి ఆలయం వైపు వచ్చే భక్తుల వాహనాలను అమృత జంక్షన్ వరకు అనుమతిస్తారన్నారు. ములుగు రోడ్డు నుంచి బస్టాండ్ వైపు వెళ్లే ఆటోలు, ద్విచక్రవాహనాలు, కార్లు, ఇతర సాధారణ వాహనాలను అలంకార్, కాపువాడ, బాలాంజనేయ స్వామి ఆలయం పక్క నుంచి ప్రయాణించాలన్నారు. ఈ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి వాహనాలను పార్కింగ్ చేయరాదని, తోపుడు బండ్లకు సైతం అనుమతి లేదన్నారు. ఈ ఆంక్షలు 27 మధ్యాహ్నం మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతాయని, గ్రేటర్ ప్రజలు గమనించి సహకరించాలని ఏసీపీ, సీఐ కోరారు.

కొండెక్కిన కొబ్బరి

- క్రమంగా పెరుగుతున్న ధరలు
- పండగ వేళ మరింత పెంచుతున్న వ్యాపారులు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పండుగ ఏదైనా.. దేవుళ్లు ఎవరైనా.. కొబ్బరికాయ కొట్టనిదే మొక్కు చెల్లదని భక్తుల నమ్మకం. అలాగే ఇళ్లలోనూ ఎలాంటి పూజ చేసినా కొబ్బరికాయ ఎంతో అవసరం. అలా ప్రతీ కార్యక్రమంలో కీలకంగా ఉండే కొబ్బరి కాయల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇక ప్రధానమైన పండుగలు, జాతరల రోజుల్లో వ్యాపారులు ఆధరను మరింత పెంచి అమ్ముతుండటంతో సాధారణ భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. నిన్నమొన్నటి వరకు కొబ్బరికాయ ధరలు ఒక్కొక్కటి రూ. 15నుంచి 20రూపాయాల వరకు విక్రయించగా.. ప్రస్తుతం సైజ్‌ను బట్టి రూ.30నుంచి రూ.40వరకు మార్కెట్లో విక్రయాలు జరుపుతున్నారు. అదే విధంగా కొబ్బరికాయల రేటు రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ఇటు రిటైల్ మార్కెట్‌లో కొబ్బరి కుడుకల ధరలు సైతం ఆకాశాన్ని అంటుతున్నాయి. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కువగా కొబ్బరి పంటలను రైతులు సాగుచేస్తుంటారు. కొన్ని నెలల క్రితం ఆ రాష్ట్రంలో తుఫాను బీభత్సం కారణంగా కొబ్బరి తోటలు నేల మట్టమైన విషయం తెలిసిందే. పంట నష్టం కారణంగా దిగుబడి తగ్గిన కొబ్బరికాయలకు మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. డిమాండ్‌కు తగ్గట్టుగా కొబ్బరికాయలు దిగుబడి లేక కాయలను అధిక రేట్లకు వ్యాపారులు విక్రయాలు జరుపుతున్నారు. దీనికి తోడు ఏటా విస్తారంగా లభించే కొబ్బరి కాయాలు ఈ సారి యూపీ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహిస్తున్న మహా కుంభమేళాకు వ్యాపారులు తరలించుకుపోవడంతో తెలుగురాష్ట్రాల్లో కొబ్బరికాయలకు కొరత ఏర్పడిందని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు.


హనుమకొండ టైలర్‌స్ట్రీట్‌లోని ఓ కొబ్బరి కాయల దుకాణం



ఎన్నడూ లేని విధంగా ధరలు..



పండుగలైనా, ఇళ్లలో ఎలాంటి శుభకార్యాలైనా, చివరకు అశుభ కార్యక్రమాలైనా కొబ్బరికాయ ఉండాల్సిందే. దైవ దర్శనం చేసుకున్న అనంతరం దేవుళ్లకు కొబ్బరికాయలు కొట్టనిదే మొక్కు తీరదన్నది నమ్మకం. కానీ ఇటీవల పెరిగిన కొబ్బరి కాయలు ధరల పెరగడంతో ఒక్కోసారి కొనుగోలు చేయకుండానే దేవుళ్లకు మొక్కులు చెల్లించుకొని వెనుదిరగాల్సి వస్తోంది. మునుపెన్నడు కొబ్బరి కాయలు ధరలు ఇంతగా పెరిగిన సందర్భాలను చూడలేదు.

– సిద్దంశెట్టి శ్రీనివాస్, కొనుగోలు దారుడు, హనుమకొండ చౌరస్తా

పెరుగుతున్న ధరలతో విక్రయాలు తగ్గాయి



ఇటీవల జరిగిన మినీ మేడారం, ఇరత పండగలు, శివరాత్రి పర్వదినంతో పాటు వివిధ దైవ కార్యక్రమాలకు ఎక్కువ సంఖ్యలో కొబ్బరి కాయల విక్రయాలు జరిగాయి. అదే విధంగా కొబ్బరి దిగుబడి తగ్గడంతో అధిక రేట్లుకు కొబ్బరిని దిగుమతి చేసుకుంటున్నాం. దీంతో ఎంతో కొంత లాభం చూసుకొని అమ్మకాలు జరిపే సరికి 5నుంచి 10వరకు కొబ్బరికాయలు కొనే వారు కూడా పెరిగిన ధరలను చూసి అంతగా కొనడం లేదు. దీంతో గిరాకీ తగ్గింది.

– కచ్చుకాయల శ్రీకాంత్, కొబ్బరికాయల వ్యాపారి, హనుమకొండ టైలర్‌స్ట్రీట్

శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు


గూడూరు ప్రాచీన సనాతన శివాలయం


కొత్తగూడ మండలం గుండం శివాలయం


అబ్బాయిపాలెంలోని గుట్టపై ఉన్న అగస్త్యేశ్వరస్వామి ఆలయం

గూడూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : గూడూరు ఏజెన్సీ మండల కేంద్రంలో సనాతన ప్రాచీన దేవాలయం ఉంది. సుమారు 12 వందల ఏళ్ల నాటి అద్భుత ఆలయం సందర్శకులను ఆకర్షిస్తోంది. ప్రతి యేట వేలాది మంది భక్తులు ఈ ఆలయాన్ని సందర్శిస్తుంటారు. ఇక్కడ స్వయంభుగా పరమేశ్వరుడు కొలువై ఉన్నాడని భావిస్తారు. శివుడి అనుగ్రహం కోసం సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. . కాకతీయుల కాలంలో క్రీ.శ 1213లో గణపతిదేవ ఈ ఆలయాన్ని నిర్మించినట్లుగా శిలాసాసనాల ద్వార తెలుస్తుందని పండితులు పేర్కొంటున్నారు. ఈ నెల 26న మహాశివరాత్రి సందర్భంగా బుధవారం రోజున ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకలకు ఏర్పాట్లను పూర్తి చేశారు.

● కొత్తగూడ : శివరాత్రి పర్వదినం సందర్భంగా ఏజెన్సీలోని కొత్తగూడ మండలం గుండం శివాలయంలో శివ నామస్మరణం మారుమోగనుంది.. నాలుగు రోజులపాటు వేడుకలు నిర్వహించేందుకు దేవాలయ కమిటీ ఏర్పాట్లు చేస్తున్నారు.. క్రీ.శ 12వ శతాబ్ధంలో కాకతీయులు వరంగల్ వేదికగా పరిపాలన సాగిస్తుండేవారు.. పాఖాల ప్రాంతంలో చెరువును తవ్వించేందుకు కాకతీయులు పూనుకున్నారు. సమీపంలోని అడవిలో (ప్రస్తుత గుండం వద్ద) శివాలయాన్ని నిర్మించి పూజలు చేసేవా రు. వారి అనంతరం కాలగర్భంలో కలిసిపోయిన శివాలయంను సమీప గ్రామస్తులు గుర్తించారు. నాటి నుంచి నేటి వరకు శివరాత్రి పర్వదినం నాడు సమీప గ్రామాలైన గుండం, తిమ్మాపురం, గుడితండా గ్రామస్తులు కమిటీ వేసుకుని శివరాత్రి వేడుకలు నిర్వహిస్తుంటారు.

● మరిపెడ : భక్తుల కోరిన కోరికలు తీర్చే అబ్బాయిపాలెం అగస్త్యేశ్వర స్వామి జాతరకు ఆలయ నిర్వాహకులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం అబ్బాయిపాలెంలోని అగస్త్యేశ్వరస్వామి ఆల యం నుంచి దేవతామూర్తు లను అశ్వ వాహనంపై ఉరేగింపుతో అగస్థప్పయ్య గుట్టపైకి తరలించారు. మహిళలు మంగళహారతులు పట్టారు. ఇంటింటికి కొబ్బరికాయలు కొట్టి మొక్కుకున్నారు. బుధవారం నుంచి మూడు రోజుల పాటు స్వామి వారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించి కల్యాణోత్సవం నిర్వహిం చనున్నారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు వేల మంది భక్తులు హాజరై గుట్టపై ఉన్న కోనేటిలో స్నానమాచరిస్తారు.

ఘర్షణ కేసులో నలుగురికి జైలు శిక్ష

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఘర్షణ కేసులో నలుగురికి జిల్లా కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జీ తిరుపతి జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు మానుకోట రూరల్ పోలీస్ స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ సురేష్ మంగళవారం తెలిపారు. కానిస్టేబుల్ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం...జిల్లా కేంద్రం శివారు జమాండ్లపల్లికి చెందిన గుంజె మహేష్, గుంజె సంతోష్, గుంజె రవి, గుంజె అజయ్, కుంచారపు శ్రీను 2019 సంవత్సరంలో ఇదే గ్రామానికి చెందిన అశోక్ వద్ద పనికి వెళ్తుండేవారని చెప్పారు. కుంచారపు శ్రీను గతంలో చేసిన పనికి డబ్బులు ఇవ్వడంలేదని మీరు ఎందుకు పనివెళ్తున్నారని చెప్పడంతో ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో శ్రీను తీవ్రగాయాలు కావడంతో శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాటి ఎస్సై రమేష్‌బాబు కేసు నమోదు చేశారని చెప్పారు. అనంతరం కోర్టులో చార్జీషీటు వేయగా అప్పటి నుంచి కేసు నడుస్తూ వచ్చింది. మంగళవారం అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) జయలత కేసును వాదించగా పూర్వాపరాలు పరిశీలించిన జిల్లా కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జీ తిరుపతి తీర్పువెల్లడిస్తూ ఏ1 నిందితుడు గుంజె మహేష్‌కు ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ. 2 వేలు జరిమానా విధించారు. ఏ2 గుంజె సంతోష్, ఏ3 గుంజె రవి, ఏ4 గుంజె అజయ్‌లకు 6 నెలల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు పేర్కొన్నారు. నిందితులకు శిక్ష పడే విధంగా సహకరించిన రూరల్ ఎస్సై దీపికారెడ్డి, కోర్టు కానిస్టేబుల్ సురేష్, ఎస్సై రమేష్‌బాబును రూరల్ సీఐ సర్వయ్య అభినందించారు.

అదృశ్యమైన వ్యక్తి అప్పగింత

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెర్లపాలెం గ్రామంలో ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. చెర్లపాలెం గ్రామానికి చెందిన మంచె కుమార్ అనే వ్యక్తి ఆదివారం రాత్రి వ్యవసాయ పొలం వద్దకు వెళ్తున్నానని వెళ్లి సోమవారం రాత్రి వరకు రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ తెలియలేదు. సోమవారం రాత్రి కుమార్ భార్య వనజ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలుసుకున్న పోలీసులు మంగళవారం కుమార్‌ను భార్య వనజకు అప్పగించినట్లు ఏఎస్సై గోపీచంద్ తెలిపారు.

గుడుంబా నిర్మూలనకు కృషి : ఎక్సైజ్ సీఐ

తొర్రూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో గుడుంబా నిర్మూలనకు కృషి చేస్తున్నామని ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ ఆర్. ప్రవీణ్ అన్నారు. మంగళవారం స్టేషన్ ఆవరణలో ఆయన మాట్లాడుతూ జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలహాసన్ రెడ్డి ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు ఆధ్వర్యంలో స్టేషన్ పరిధిలో దాడులు చేసి 96 కేసులు నమోదు చేసి 117 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. 584 లీటర్ల నాటుసారా, 3,477 కేజీల నల్లబెల్లం, 260 కేజీల పటిక, 5,130 లీటర్ల బెల్లం పానకం స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశామన్నారు. 32 వాహనాలు సీజ్ చేసి 217 మందిని తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేసి కేసులు నమోదు చేశామన్నారు. ఆరుగురిని రిమాండ్ చేసి రూ.2లక్షల 30వేల జరిమానా విధించమన్నారు. పట్టుబడిన 59 వాహనాలను వేలం వేయగా రూ.22 లక్షల ఆదాయం సమకూరినట్లు తెలిపారు .

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే సీజ్ చేస్తాం

తొర్రూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లను సీజ్ చేస్తామని జిల్లా మెటర్నల్, చైల్డ్ హెల్త్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సారంగం అన్నారు. మంగళవారం తొర్రూరులోని అమ్మ, కవిత, వివిధ ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణుల వివరాలు 12 వారాల్లో నమోదు చేసి మొదటి, రెండో చెకప్‌కు ఆరోగ్య కేంద్రాలు, ఇతర చెకప్‌లకు జిల్లా కేంద్రంలో పరీక్షలు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. కేవీ రాజు, అరుణ్, వైద్యాధికారులు ఉన్నారు.

లాలుతండాలో మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఇనుగుర్తి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి మండలం లాలుతండా మాజీ ఉపసర్పంచ్ గుగులోత్ నరేందర్ తండ్రి తావు మృతి చెందడంతో మంగళవారం ఆయన్ను మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పరామర్శించారు.మాజీ సర్పంచులు దార్ల రాంమూర్తి, బానోత్ రామన్న, జాటోత్ హరిచంద్రు, బేతమల్ల చంద్రయ్య ఉన్నారు.

ఇద్దరు బైక్ చోరీ నిందితుల అరెస్ట్

మరిపెడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు బైక్ చోరీల నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై బోలగాని సతీశ్‌గౌడ్ తెలిపారు. మంగళవారం మరిపెడ బంగ్లాలోని కార్గిల్ సెంటర్లో స్థానిక పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా మండల ంలోని ఎల్లంపేట గ్రామానికి చెందిన తాళ్లపల్లి నరేశ్, చందా సాయిలు బైక్‌లపై అనుమానస్పదంగా కనిపించారు. వారిని విచారించగా తాళం వేసి ఉన్న బైక్‌లను అపహరిస్తున్నట్లు తేలింది. ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

పాఖాల నీటితో ఏజెన్సీలోని చెరువులను నింపాలి

కొత్తగూడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ప్రభుత్వంలో రామప్ప చెరువు నుంచి పాఖాల చెరువులోకి తీసుకువస్తున్న నీటిని లిఫ్ట్ ద్వారా తీసుకువచ్చి ఏజెన్సీలోని కొత్తగూడ, గంగారం మండలాల్లోని చెరువులను నింపి రెండు పంటలకు నీరందించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు కోరారు. కొత్తగూడలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేణు మాట్లాడారు. మాజీ సర్పంచ్‌లు భూపతి తిరుపతి, మంగమ్మ రవి, మాజీ ఎంపీటీసీలు మోకాళ్ల సంతోషరాణి వెంకటేష్, ననుబోతుల స్వప్న లింగన్న యాదవ్, నాయకులు వాసం వెంకన్న, రావోజీ, రామన్న, సురేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

తొర్రూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శాసన మండలిలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానని మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ అన్నారు. మంగళవారం తొర్రూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తనకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. తాను ఎమ్మెల్సీగా పనిచేసిన సమయంలో సమస్యల పరిష్కారానికి ఏవిధంగా కృషి చేసిన విషయం ఉపాధ్యాయులకు వివరించారు. జాక్టో ఉపాధ్యాయ సంఘం నాయకులు ప్రవీణ్ రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, సతీష్, వెంకన్న తదితరులు ఉన్నారు.

విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీయాలి


పాఠశాలను సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వాత్సవ్ టోప్పో

గార్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను ఉపాధ్యాయులు వెలికి తీసి వారిని ఉన్నతులు తయారు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వాత్సవ్ టోప్పో అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నడుస్తున్న బంజారా సేవా సమితి అనాథ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల చదవులు, పాఠశాల నిర్వాహణ పరిసరాలను ఆయన స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో బంజారా సేవా సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు తేజవత్ జోగిరాం నాయక్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖల ఆఫీస్‌ల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

మహబూబాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో మంగళవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆకస్మిక తనీఖీలు చేపట్టారు. జిల్లా విద్యాశాఖ, వైద్యఆరోగ్యశాఖ కార్యాలయాల్లో తనీఖీలు నిర్వహించారు. ప్రభుత్వ శాఖల్లో జరుగుతున్న కార్యాకలపాల గూర్చి సిబ్బందిని అడిగి తెలుసుకు న్నారు. సమయపాలన పాటిస్తూ క్షేత్ర స్థాయిలో ప్రజలకు సేవలందించాలని సూచించారు.ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించా రు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం కేజీబీవీ పాఠశాల, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని సందర్శించారు. కేజీబీవీలో వంటగది, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డైట్ మెనూ ప్రకారం పక్కాగా ఉండాలన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ లకావత్ వెంకట్, ఆర్ఎంవో జగదీష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా

తొర్రూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తొర్రూరు ఆర్టీసీ డిపో ఎదుట కార్మికుల ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చి 15 నెలలు దాటినా ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమ్మె నోటీసు ఇచ్చి నెలరోజులు పూర్తైనా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. సమ్మెకు కార్మికులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జే యాదగిరి, చారి, బాబు, సరియ, వనజ, కేవీ రమణ, రమేష్, జేబీ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

బొడ్రాయి పండుగకు హాజరైన వరంగల్ ఎంపీ

కేసముద్రం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్వలలో బొడ్రాయి ప్రతిష్ఠించి రెండు సంవత్సరాలైన సందర్భంగా నిర్వహించిన పండుగకు మంగళవారం వరంగల్ ఎంపీ కడియం కావ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని బొడ్రాయికి ఆమె పూజలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కేసముద్రం, ఇనుగుర్తి మండలాల కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు, కూరెళ్లి సతీష్, బండారు దయాకర్, ఎవీణ్‌కుమార్ ఉన్నారు

పద్మశాలి సంఘం జిల్లా నూతన కార్యవర్గం


చిలకమారి వెంకటేశ్వర్లు


అనుమాల వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నట్లు సంఘం రాష్ట్ర ప్రధానకా ర్యదర్శి మాచర్ల రామచందర్‌రావు తెలిపారు. మహబూబాబాద్‌లో మంగ ళవారం నిర్వహించిన సంఘ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చిలకమారి వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులుగా అను మాల వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంటుగా వన్నాల సాగర్, ప్రధాన కార్యదర్శిగా సామల నర్సయ్య, కోశాధికారిగా బొమ్మ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా కారంపుడి ఉపేందర్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు కైరంకొండ వీరన్న, ములక కృష్ణమూర్తి, కోరాకుల రాజేశ్వర్, మామిడాల శ్రీనివాస్, సామల లక్ష్మీనారాయణ, దునవర్తి వెంకటేశ్వర్లు, విజయలక్ష్మీ, వెంకటేశ్వర్లు, రమేష్, శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, వెంకన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి కృషి : గుజ్జుల



సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డిని గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు.మహబూబాబాద్ బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలపై పోరాడే వ్యక్తి సరోత్తంరెడ్డి అని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి జీవో నెంబరు 317ను రద్దు చేస్తామని ఇచ్చిన, హామి నేటికి అమలుకు నోచుకోలేదని చెప్పారు. ఉపాధ్యాయుల డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, పేరివిజన్ కమిటీ (పీఆర్సీ)ని పట్టిం చుకున్న పాపాన పోలేదని విమర్శించారు. ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించిన ఘనత బీజేపీకి దక్కిందన్నారు. కేంద్రం ప్రభుత్వ ఉద్యోగులకు రూ.12.50 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయించిదని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వల్లభ వెంకటేశ్వర్లు, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు వద్దిరాజు రాంచందర్‌రావు, సింగారపు సతీష్ , చీకటి మహేష్‌గౌడ్, వెన్నమల్ల అజయ్, గద్దం అశోక్, పల్లె సందీప్, జహేందర్ నాయక్, ఓర్సు పద్మ, గాంధీ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘వేం’ను విమర్శించే స్థాయి కవితకు లేదు

మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న మారెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి

కేసముద్రం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : నాలుగు దశాబ్దాల రాజకీయ చరిత్రలో మచ్చలేని నేత, ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని విమర్శించే స్థాయి ఎమ్మెల్సీ కవితకు లేదని కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. మార్కెట్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లిక్కర్ స్కాంతో రాష్ట్రం పరువును తీయడమేకాకుండా ఢిల్లీలో కేజ్రీవాల్ రాజకీయ పతనానికి కారణమైన ఘనత కవితదేనని దుయ్యబట్టారు. కాళ్లపట్టుకొని బెయిలు తీసుకువచ్చే సంస్కృతి ఆమెదేనని విమర్శించారు. వెంటనే సీఎంకు, వేం నరేందర్‌రెడ్డికి క్షమాపణలు చెప్పాలన్నారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు దస్రూనాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి అంబటి మహేందర్‌రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, దయాకర్, దామెరకొండ ప్రవీణ్‌కుమార్, చిదిరాల వసంతరావు, వోలం రమేష్, ఎండీ.అయబ్‌ఖాన్, చింతకుంట్ల యాదగిరి, నూకల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● ఇనుగుర్తి : సీఎం రేవంత్‌రెడ్డి, సీఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డిలపై ఎమ్మెల్సీ కవిత అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కూరెల్లి సతీష్ అన్నారు. ఇనుగుర్తిలో మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ పదేళ్లలో మానుకోటను కన్నెత్తి చూడని కవిత ఈరోజు వచ్చి విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఆయన వెంట డీసీసీ కార్యదర్శి చిన్నాల కట్టయ్య, కొట్టం రాము, గుజ్జునూరి బాబురావు, మామిడి జనార్ధన్, తమ్మడపల్లి కుమార్, వల్లంల మురళి, మలిశెట్టి శ్యాం, కొలిపాక నారాయణ, మార్క సారయ్య, నాగెల్లి సుధీర్, యాదగిరి, యాకన్న, గంజి సంతోష్‌రెడ్డి, సూర్య పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

● జిల్లా ఇంటర్ విద్యాధికారి మదార్‌గౌడ్


వార్షికోత్సవంలో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ విద్యాధికారి మదార్‌గౌడ్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి మదార్‌గౌడ్ అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం అధ్యక్షతన కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ.. మార్చి 5 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ వార్షిక పరీక్షలను ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతమైన వాతావరణలో రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చుకొని మిమ్ములను చదివిస్తున్నారని వారి కళలను వమ్ము చేయకుండా ఉత్తీర్ణత సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. గత సంవత్సరం ఫలితాల్లో కళాశాల రాష్ట్రస్థాయి మార్కులతో పాటు క్రీడా సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉందని ప్రిన్సిపాల్ సదానందం తెలిపారు. అనంతరం విద్యార్థిను లు చేసిన నృత్యాలు ఆకట్టుకు న్నాయి. కార్యక్ర మంలో కల్లెం వీరారెడ్డి, రాందాస్, కనకయ్య, వెంకటేశ్వర్లు, యాదగిరి, కల్లెం వెంకటరెడ్డి, మల్లారెడ్డి, సంజీవ, రమేష్, నయీమ్, గణేష్, శ్రీనివాస్‌రెడ్డి, నాగిరెడ్డి, సుధాకర్, బుధ్యా నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేదల సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న మోదీ

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో పేదల సంపదను ప్రధాని మోదీ కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్‌నాయక్ విమర్శించారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో మంగళవారం సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రజలపై దాని ప్రభావం అనే అంశంపై సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా హాజరైన శోభన్‌నాయక్ మాట్లాడారు. శెట్టి వెంకన్న, అల్వాల వీరయ్య , కుంట ఉపేందర్, ఆకుల రాజు, గునిగంటి రాజన్న, వెంకన్న పాల్గొన్నారు .

పది పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

మహబూబాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం పది పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 46 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఉంటాయన్నారు. పరీక్షల నిర్వహణకు 46 మంది చీఫ్ సూపరిండెంట్లు, 46 మంది డిపార్టుమెంట్ అధికారులు, 11 మంది జిల్లా అధికారులను నియమించండా జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం 8194 మంది పదవరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని చెప్పారు. అదనపు కలెక్టర్ కె. వీరబ్రహ్మచారి, ఆర్డీవోలు గణేష్, కృష్ణవేణి, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో మురళీధర్, ఇంటర్ అధికారి మదార్, డీపీవో హరిప్రసాద్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

నెల్లికుదురు ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలలో ప్రసవాల సంఖ్య పెంచాలని మెటర్నల్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ సారంగం తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్యబోధకులు కేవీ.రాజు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో సెర్ప్ ఉద్యోగుల బదిలీలు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లాలో త్వరలో గ్రామీణ పేదరికి నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులు బదిలీ కానున్నారు. జిల్లా వ్యాప్తంగా 121 మంది ఉండగా అందులో 84 మంది సీసీలు, 21 మంది ఏపీఎంలు, ఐదుగురు డీపీఎంలు, ఒకరు అడిషనల్ డీఆర్‌డీఏ ఏపీడీ, 10 మంది కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నారు. ఈ నెల 24 నుంచి మార్చి 1 వరకు సెర్ప్ ఉద్యోగుల డాటాను నివేదించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం. మార్చి 3 నుంచి విద్యార్హతల సర్టిఫికెట్ల పరిశీలించనున్నట్లు తెలుస్తోంది. 2015 లో బదిలీలు జరిగిన తర్వాత మళ్లీ జిల్లాలో ఉద్యోగులు బదిలీలు కాలేదు. డీపీఎంలు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లాల్లో ఎక్కడికైనా బదిలీ చేసే అవకాశం ఉంటుంది. ఏపీఎంలు డివిజన్ పరిధిలో బదిలీలుంటాయి. సీసీలు సమీప మండలాలకు బదిలీ చేసే అవకాశం ఉంటుంది.

క్షత గాత్రులకు ప్రభుత్వ విప్, పరామర్శ

డోర్నకల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ -మహబూబాబాద్ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఖమ్మంజిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డోర్నకల్ మాజీ మునిసిపల్ చైర్మన్ వాకుడోత్ వీరన్న గొర్ల సత్తిరెడ్డి, ఎర్రశ్రీను, జేవీఆర్‌లను మంగళవారం ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచందర్ నాయక్ పరామార్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు మాదా శ్రీనివాస్ తాళ్ళూరి హనుమ ఉన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

డోర్నకల్ ఫిబ్రవరి 25 ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ములకలపల్లి సమీపంలో అక్రమంగా ఆటోలో తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకునట్లు మహబుబాబాద్ ఎక్సైజ్ ఎస్సై అశోక్ కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి ములకపల్లి వద్ద ఎక్సైజ్ సిబ్బంది శ్రీనివాస్, హచ్చనాయక్, రాజ్ కుమార్‌లతో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో అటుగా వచ్చిన ఆటో అనుమాస్పదంగా కనిపించడంతో ఆటోను పరిశీలించగా బోడ్రాయి తండాకు చెందిన వెంకన్న, సేవిరీ, ఆటోలో 50కేజీల పంచదారతో పాటు 5వేల విలువగల మద్యం వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బైండోవర్ ఉల్లంఘన, వ్యక్తికి జరిమాన

కొత్తగూడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : నాటుసారా విక్రయం కేసులో బైండోవర్ చేసిన వ్యక్తి నిబంధనలు ఉల్లంఘించడంతో రెవెన్యూ అధికారులు భారీగా జరిమాన విధించారు. ఎక్సైజ్ సీఐ భిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పొగుళ్లపల్లి గ్రామానికి చెందిన భైరబోయిన రాములును నాటుసారా విక్రయం కేసులో జనవరి 25న తహసీల్దార్ రమాదేవి ముందు ఎక్సైజ్ అధికారులు బైండోవర్ చేశారు. ఫిబ్రవరి 10న భైరబోయిన రాములు నాటుసారా అమ్ముతూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు మంగళవారం రాములును ఇన్‌చార్జి తహసీల్దార్ పద్మావతి ముందు హాజరుపరిచారు. రాములుకు ఇన్‌చార్జి తహసీల్దార్ పద్మావతి రూ. 50వేల జరిమానా విధించారు. చాలన్ ద్వారా రాములు ప్రభుత్వానికి రూ. 50వేలు చెల్లించినట్లు ఎక్సైజ్ సీఐ భిక్షపతి తెలిపారు. ఎస్ఐ రాజేశ్వరి, హెడ్ కానిస్టేబుల్ బుచ్చయ్య, కానిస్టేబుళ్లు సుధాకర్, నందకిశోర్ పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

కొత్తగూడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : భార్య తనపై పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేయడంతో మనస్తాపానికి గురైన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పొగుళ్లపల్లిలో మంగళవారం జరిగింది. ఎస్సై కుశకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్నాల కట్టయ్య, కేతమ్మ దంపతుల కుమారుడు చిన్నాల మురళీకృష్ణ(22)కు వరంగల్ జిల్లా ఖానాపురం మండలం చిలకమ్మ నగర్‌కు చెందిన శ్రావణితో 11నెలల క్రితం వివాహం అయింది. కుటుంబ కలహాలతో శ్రావణి వారం రోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. శ్రావణి ఖానాపురం పోలీస్‌స్టేషన్‌లో తనపై పిర్యాదు చేసిన విషయం తెలియడంతో మురళీకృష్ణ వేలుబెల్లిలోని తన అక్క దేవలక్ష్మి ఇంటికి సోమవారం వెళ్లాడు. మనస్తాపానికి గురైన మురళీకృష్ణ సోమవారం రాత్రి గ్రామ సమీపంలో చెరువువద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అక్క దేవలక్ష్మి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుశకుమార్ తెలిపారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

మరిపెడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఎస్ఈ నరేశ్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఎల్లంపేట సబ్‌స్టేషన్‌లో వీరారం ప్రత్యేక ఫీడర్‌ను ప్రారంభించారు. వీరారం గ్రామానికి ప్రత్యేక ఫీడర్ లేక విద్యుత్ లోఓల్టేజీ సమస్యతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈ మధుసూదన్, ఏడీఈ అజయ్, ప్రొడక్షన్ ఏడీఈ లోక్‌నాథ్‌రెడ్డి, డీఈ విద్యాసాగర్, ఏఈ నవ్య, సబ్ ఇంజనీర్ రుబీనా, లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.